ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

యాదాద్రి జిల్లా శ్రీ సిద్ధలింగేశ్వర స్వామి దేవాలయంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పూజలు చేశారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని, అభిషేకం, అర్చన చేశారు.

- కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 29

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

దుండిగల్, జనవరి 29 : అర్హులైన ప్రతిరైతుకు రైతురుణ మాఫీ పథకాన్ని వర్తింపజేయాలని బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్ జిల్లాలోని పలువురు పీఏసీఎస్ చైర్మన్లతో కలిసి మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రకళను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండి మైసమ్మ-దుండిగల్ మండలం, బౌరంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) పరిధిలో మొత్తం 632 మంది రైతులు ఉండగా, 17మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీని రైతులందరికీ వర్తింపజేయాలన్నారు.

జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపిక

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 29 : కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 126 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.అలివేలు మంగమ్మ తెలిపారు. బుధవారం కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ, ఎల్‌ఏక్యూఎస్‌ఎస్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాను కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. అలివేలు మంగమ్మ, కళాశాల టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ కే.శ్రీనివాస్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ కే.కరుణాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల జాబ్‌మేళాలో 378 మంది విద్యార్థులు పాల్గొనగా... 126 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా కంపెనీల ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

కృష్ణచైతన్య రెడ్డి (ఫైల్)

మూసాపేట, జనవరి29: ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్ నుంచి నగరానికి వలస వచ్చిన దంపతులు కూకట్‌పల్లి పరిధి శంశీగూడలో నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు నబిన్(17) నెల రోజుల క్రితం నగరానికి వచ్చి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. బుధవారం తల్లిదండ్రులు ఉదయం పనికి వెళ్లగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు పని నుంచి ఇంటికి వచ్చి చూసే సరికి విగతజీవిగా పడిఉన్న తన కుమారుడిని చూసి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వివేకానందనగర్‌లో..

ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ కె.ముత్తు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణ జిల్లా పెద్దవోగిరాలకు చెందిన కృష్ణచైతన్యరెడ్డి(34) కూకట్‌పల్లి వివేకానందనగర్‌లో నివాసం ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. బుధవారం సాయంత్రం భార్య పూజ పిల్లలను డ్యాన్స్ క్లాసుకు తీసుకువెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన భార్య గమనించి హుటాహుటిన దవాఖానకు తరలించింది. అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విదేశీ యువతులతో వ్యభిచారం

శేరిలింగంపల్లి, జనవరి 29 : విదేశాల నుంచి యువతులను తీసుకువచ్చి గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం చేయిస్తున్న ముఠా గుట్టు రట్టయింది. మంగళవారం రాత్రి ఎస్‌వోటీ పోలీసులు, గచ్చిబౌలి పోలీసులతో కలిసి వ్యభిచార గృహంపై దాడులు నిర్వహించి 9 మంది విదేశీ యువతులను రెస్క్యూ చేశారు. వీరితో పాటు ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేయగా, నిర్వాహకులు పరారయ్యారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలి ఐటీ కారిడార్ పరిధిలోని టీఎన్జీవో కాలనీలోని ఓ ఫ్లాట్‌లో కొన్ని రోజుల క్రితం ఓ వ్యక్తి అద్దెకు తీసుకొని పలు దేశాల నుంచి యువతులను తీసుకువచ్చి వ్యభిచారం చేయిస్తున్నాడు. కాగా ఈ వ్యభిచార గృహం పై సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు, ఎస్‌వోటీ పోలీసులు హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీసులతో కలిసి మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సదరు ఫ్లాట్‌లో ఉన్న విదేశీ యువతులను అక్కడి నుంచి రెస్క్యూ చేసి, ఒకరిని అరెస్ట్ చేశారు. నిర్వాహకులు ఘటనా స్థలి నుంచి పరారు కాగా, ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తాం

మియాపూర్, జనవరి 29 : వీధుల్లో పూర్తి స్థాయిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తామని మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. కాలనీల్లో చెడిపోయిన దీపాల స్థానంలో నూతనంగా అమర్చాలన్నారు. డివిజన్ పరిధిలోని స్టాలిన్‌నగర్‌లో వీధి దీపాల ఏర్పాటును కార్పొరేటర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి వేళల్లో కాలనీ ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా అన్ని స్తంభాలకు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఆయన వెంట శ్రీనివాస్, కాలనీ వాసులు రాణి, వెంకటేశ్, శ్యామల, నరేశ్, మోహిన్, హన్మంతరావు, సాగర్, మల్లేశ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నియోజకవర్గ మండల విద్యాశాఖ అధికారులతో పలు సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, జనవరి 28 : నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులకు సూచించారు. బుధవారం పేట్ బషీరాబాద్ క్యాంపు కార్యాలయంలో కుత్బుల్లాపూర్, దుండిగల్, బాచుపల్లి మండలాల విద్యాశాఖ అధికారులతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు అందించేలా సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంఈవోలు జమినికుమారి, రామకృష్ణ, కృష్ణ, అసిస్టెంట్ ఎంఈవో రమేశ్ పాల్గొన్నారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

దుండిగల్ : ఫిబ్రవరి 8వ తేదీ నుంచి 5 రోజుల పాటు నిర్వహించనున్న సూరారం కట్టమైసమ్మ తల్లి, రేణుక ఎల్లమ్మ తల్లి జాతరను విజయవంతం చేసేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు, అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. కట్టమైసమ్మ ఆలయ ప్రాంగణంలో బుధవారం ఆలయ కమిటీ సభ్యులు, వివిధ విభాగాల అధికారులతోపాటు ఎమ్మెల్యే వివేకానంద్ స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతరకు లక్షలాదిమంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం అమ్మవార్ల జాతర వాల్‌పోస్టర్, కరపత్రికను ఆవిష్కరించారు. అంతకుముందు వారు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు, దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ మల్లారెడ్డి, సూరారం సీఐ భరత్ కుమార్, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, వాటర్‌వర్క్స్ జీఎం అశోక్, ఈఈ కిష్టప్ప, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ రహిత సమాజాన్ని నిర్మించాలి

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

కొండాపూర్, జనవరి 29 : సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ కార్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ సైబర్ క్రైం టీం, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ ఆశీష్ రెడ్డి, సునీల్ సోమనగుర్తి, సాయినాథ్‌చారి, అన్నపూర్ణ గాడేపల్లి పాల్గొని సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఆర్థిక లావాదేవీలు, ఆన్‌లైన్ వ్యవహారాల్లో అనుమానాస్పద స్థితి సంఘటనలు ఎదురైన వెంటనే సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిందిగా తెలిపారు. డ్రగ్స్ దూరంగా ఉండాలని, డ్రగ్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు.

కచేరితో నిర్వహిస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న త్యాగరాజ ఆరాధనా సంగీతోత్సవాలు

కొండాపూర్, జనవరి 29 : మాదాపూర్‌లోని శిల్పారామంలో త్యాగరాజ ఆరాధనా సంగీతోత్సవ 10వ వార్షిక వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి సంవత్సరం సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలు 5 రోజుల పాటు పలువురు కళాకారుల సంగీత గాత్ర, నృత్య ప్రదర్శనలతో ఆద్యాంతం ఆకట్టుకోనున్నాయి. సంగీతోత్సవాల ప్రారంభాన్ని సంగీత విధూషి హరి ప్రియ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్వాన్ నిహార్, హరిప్రియ, విద్వాన్ వైద్యనాథన్ బాలసుబ్రమణ్యం తమ గాత్ర కచేరిలతో సందర్శకులను అలరించారు.

ప్రజాపాలన అంటే.. పేదల ఇండ్లు కూల్చడమేనా..

బీఆర్ఎస్ నిజాంపేట అధ్యక్షుడు రంగరాయప్రసాద్

శ్రీచైతన్య కళాశాల భవనానికి మార్కింగ్ వేసిన అధికారులు

రాజీవ్‌గృహకల్పలో పర్యటించి స్థానికులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

దుండిగల్, జనవరి 29: ప్రజాపాలన అంటే ...పేదల ఇండ్లు కూల్చటమేనా...? అని బీఆర్ఎస్ నిజాంపేట కార్పొరేషన్ అధ్యక్షుడు వి.రంగరాయప్రసాద్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్ ప్రశ్నించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 20 సంవత్సరాల క్రితమే ప్రభుత్వమే నిర్మించిన రాజీవ్ గృహకల్ప సముదాయంలోని కొన్ని అపార్ట్‌మెంట్లకు రెండురోజుల క్రితం ఇరిగేషన్ అధికారులు స్థానిక ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మార్కింగ్ ఇవ్వడం వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలు బుధవారం రాజీవ్‌గృహకల్ప సముదాయాన్ని సందర్శించడంతో పాటు స్థానిక ప్రజలతో కలిసి మార్కింగ్ వేసిన భవనాలను పర్యవేక్షించి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు సమాచారాన్ని తెలియపరిచారు. అలాగే స్థానికంగా నివసిస్తున్న ప్రజలకు అండగా ఉంటామని, ఎటువంటి నష్టం కలగకుండా చూసే బాధ్యత తీసుకుంటామని, ఎవరు భయభ్రాంతులకు గురికావొద్దని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు గృహకల్ప వాసులు పాల్గొన్నారు.

భయాందోళనలో ప్రజలు..

కాగా, రెండురోజుల క్రితం నీటిపారుదల శాఖ అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నిజాంపేట్‌లోని తుర్కచెరువు పరిసర ప్రాంతంలోని పలు నిర్మాణాలకు మార్కింగ్ చేయడంతో ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇందులో రాజీవ్‌గృహకల్పలోని కొన్ని అపార్ట్‌మెంట్లు, నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీ సమీపంలోని శ్రీచైతన్య బాయ్స్ క్యాంపస్ బిల్డింగ్, సిరివ్యాలీలోని కొన్ని విల్లాలతో పాటు లతాలేక్ వ్యూలోని మూడు అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. లతాలేక్ వ్యూలోని మూడు అపార్ట్‌మెంట్లల్లో సుమారు 180 కుటుంబాలు ఉంటున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన అపార్ట్‌మెంట్లకు అధికారులు రెడ్‌మార్కింగ్ ఎందుకిచ్చారో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. ఓ వైపు హైడ్రా పేరిట నగరం నలుమూలల కూల్చివేతలు జరుగుతున్న సమయంలో ఇరిగేషన్ అధికారులు ఇలా భవనాలకు రెడ్‌మార్కింగ్ ఇవ్వడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. మరో వైపు ఇదే విషయమై వివరణ కోరేందుకు యత్నించిగా అధికారులు స్పందించక పోవడం గమనార్హం. ఎఫ్‌టీఎల్ పరిధిని గుర్తించేందుకే అధికారులు మార్కింగ్ వేసినట్లు స్థానికులు భావిస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మాదాపూర్, జనవరి 29: మౌలిక వసతుల కల్పనకు ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ రూ.70లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు బుధవారం హఫీజ్‌పేట్ కార్పొరేటర్ వి. పూజితగౌడ్‌తో పాటు జీహెచ్ఎంసీ అధికారులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని యూత్ కాలనీలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి కాలనీలో పాదయాత్ర చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

మైత్రినగర్ ఫేజ్ 1 కాలనీలో రూ. 25 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయగా, హఫీజ్‌పేట్‌లోని వార్డ్ కార్యాలయం నుంచి ఖాయిదామ్మకుంట చెరువు రోడ్డు వరకు రూ. 45 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మియాపూర్, జనవరి 29: మెరుగైన బస్ సర్వీసు సేవలు సహా ప్రయాణికుల సమస్యలను తెలుసుకునేందుకు మియాపూర్ ఆర్టీసీ డిపో2 ఆధ్వర్యంలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం వెంకటేశం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 9959226420 ద్వారా ప్రయాణికులు తమ సూచనలు సలహాలు తెలపాలని ఆయన కోరారు. మరింత ప్రజాదరణ పొందేలా మెరుగైన సురక్షితమైన సేవలను అందించే లక్ష్యంతో కృషి చేస్తున్నట్లు డీఎం తెలిపారు.

ట్యాంకర్ నుంచి ఆయిల్ లీకేజీ

ప్రమాద నివారణకు ట్రాఫిక్ పోలీసుల చర్యలు

రోడ్డుపై మట్టిని పోయిస్తున్న బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు

బాలానగర్, జనవరి 29 : ట్యాంకర్ నుంచి ఆయిల్ లీకేజీ కావడంతో రోడ్డుపై కిలోమీటర్ మేర వ్యాపించి ప్రమాదకరంగా మారింది. ఈ ఘటన బాలానగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సమాచారం అందుకున్న బాలానగర్ ట్రాఫిక్ సీఐ సురేశ్ తమ సిబ్బందిని హుటాహుటిన ఘటనా స్థలానికి పంపించి వాహనాలకు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఐడీపీఎల్ చౌరస్తా నుంచి ఐడీపీఎల్ గేట్ వైపునకు రోడ్డుపై ఆయిల్ వ్యాప్తి చెందింది. ట్రాఫిక్ పోలీసులు స్పందించి మట్టి పోయించడంతో వాహనదారులు ప్రశంసలు కురిపించారు.

ఫాగింగ్‌తో దోమల నివారణ

హైదర్‌నగర్ డివిజన్ అంబర్ చెరువు సుందరీకరణ పనులను కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తరచూ ఫాగింగ్ చేయాలని, డ్రోన్‌తో మందుల పిచికారీ, ఆయిల్ సీడ్ బాల్స్‌ను చెరువులోకి వేసి దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. పరిసరాలను సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో ఏఈ లక్ష్మీనారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

- మియాపూర్, జనవరి 29

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన బీఆర్ఎస్ శ్రేణులు

దుండిగల్, జనవరి 29 : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉమ్మడి రంగారెడ్డి ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, సంక్షేమ సంఘాల నేతలు బుధవారం శంభీపూర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను వివరించడంతో పాటు వాటిని పరిష్కరించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు.

ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యం చేరుకోవాలి

పన్ను విభాగం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి

మియాపూర్ , జనవరి 29 : ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యాన్ని వంద శాతం చేరుకోవాలని చందానగర్ డీసీ మోహన్‌రెడ్డి ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పన్ను వసూళ్లను పూర్తి చేసి ఆదర్శంగా నిలవాలన్నారు. చందానగర్ సర్కిల్ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్ల పురోగతిపై పన్ను వసూళ్ల విభాగం అధికారులు, సిబ్బందితో డీసీ మోహన్‌రెడ్డి బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలి కాలంలో ప్రభుత్వ సర్వేల నేపథ్యంలో పన్ను వసూళ్ల ప్రక్రియ కొంత మందగించిందని, ఇక నుంచి వేగవంతం చేయాలని ఆదేశించారు. డాకెట్ వారీగా టీఐలు, బీసీలు ప్రతి వ్యాపార , వాణిజ్య , గృహ సముదాయాలకు వెళ్లి పన్ను వసూళ్లను చేపట్టాలని, మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలన్నారు. ఇప్పటికే సర్కిల్ వ్యాప్తంగా బకాయిదారులకు రెడ్ నోటీసులను జారీ చేసామన్నారు. ఏఎంసీ సహా ఇతర అధికారులు రోజువారీ పన్ను వసూళ్లపై సమీక్షించాలని , వెనకబడే సిబ్బందిని చైతన్య పరిచి చురుకుగా పని చేసి లక్ష్యం సాధించేలా చూడాలని డీసీ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లపై విచారణను ఈ నెల 31 లోగా పూర్తి చేయాలని డీసీ మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు సూపర్‌వైజర్లు, సర్వేయర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. విచారణతో పాటు ఆన్‌లైన్‌లో అర్హతను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీరెడ్డి, విజయ్, కృష్ణ , ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల పేరుతో వసూళ్లు

అధికారులపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్ట్ నేతలు వినతి

కూకట్‌పల్లి సర్కిల్ ఉపకమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న జర్నలిస్ట్ నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 29 : జర్నలిస్టుల పేరుతో భవన నిర్మాణదారులను ఇబ్బంది పెడుతూ వసూళ్లకు పాల్పడుతున్న అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ... కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల ఉప కమిషనర్లు గంగాధర్, వంశీకృష్ణలకు వినతిపత్రాలు అందించారు. జంట సర్కిళ్ల పరిధిలో పనిచేస్తున్న టౌన్‌ప్లానింగ్, సిబ్బంది వ్యవహారశైలితో సమాజంలో జర్నలిస్టుల విలువలు దిగజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరులకు డబ్బులు ఇవ్వాలంటూ నిర్మాణదారుల వద్ద నుంచి పెద్ద మొత్తం వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు వారి అవసరాల కోసం సోషల్ మీడియాలో రాతలు ఆరాయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, సోషల్ మీడియాలో ఉన్నవారికి విలేకరులుగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. భవనాల వద్ద డబ్బులు ముడితే ఒకలా.. ముట్టకపోతే మరోలా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. విలేకరులకు డబ్బులు ఇస్తున్నామని చెప్పుకుతీరుగుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పుడు ప్రచారం చేస్తున్న అధికారిపై చర్యలు తీసుకోకుంటే సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, రాష్ట్ర నాయకుడు ఆర్‌కె.దయాసాగర్, శ్రీనివాస్, కూకట్‌పల్లి అధ్యక్షుడు కరీం, మాణిక్యరెడ్డి, గంగరాజు, సదామహేశ్, శ్రీనివాస్‌యాదవ్, చంద్ర, భాస్కర్‌చారి, పవన్, సోమిరెడ్డి ఉన్నారు.

అవినీతి అధికారులపై చర్యలేవి?

హౌసింగ్‌బోర్డు వీసీ ప్రజల మాటలు వినడం లేదు కోప్ స్వచ్ఛంద సంస్థ

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 29 : రాష్ట్ర హౌసింగ్ బోర్డు వీసీ, ఎండీగా బాధ్యతలు చేపట్టిన గౌతమ్ మంత్రి మాటలు తప్ప... ప్రజల మాట వినడం లేదని, ఇటీవల నిర్వహించిన హౌసింగ్ స్థలాల వేలంపాట సక్రమంగా నిర్వహించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, లబ్ధిదారుల సొమ్మును దుర్వినియోగం చేశారని రాష్ట్ర హౌసింగ్‌బోర్డు శాఖమంత్రికి కోప్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు యు.శివప్రసాద్ ఫిర్యాదు చేశారు. గతంలో హౌసింగ్‌బోర్డు పరిధిలో నిర్వహించిన బహిరంగ వేలంపాటలు ప్రశాంతంగా జరిగాయని, మొన్న విడుదల చేసిన వేలంపాట ప్రకటనలో పాతకొలతలు, కొత్త కొలతలు అని తప్పులు సవరిస్తూ పదే పదే ప్రకటనలు జారీ చేసి ప్రజలను మోసం చేశారన్నారు. సౌత్‌జోన్ పరిధిలోని రావిరాలలో 15 స్థలాలకు గోడలు తొలగించకుండా బహిరంగ ప్రకటన జారీ చేశారని విమర్శించారు. హౌసింగ్‌బోర్డులో పలువురు అవినీతి అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. జాయింట్ వెంచర్‌లో 5వేల కోట్ల కుంభకోణం విజిలెన్స్ రిపోర్ట్ ఏమైందని, ఏసీబీ కేసులు ఉన్న వారిపై చర్యలు తీసుకుంటున్నారా అని, లబ్ధిదారుల సొమ్మును బాధ్యత లేకుండా దుబారా ఖర్చు చేసిన వారిపై చర్యలు తీసుకున్నారా అని అడిగారు. కేపీహెచ్‌బీ కాలనీ సాయినగర్‌లో బైనంబర్లు వేసి 10 ఎకరాలు ఆక్రమించిన వారికి సహకరించిన అధికారులపై చర్యలు ఏవని, సాయినగర్ కాలనీలో హౌసింగ్ ఆధీనంలో ఉన్న 80 ప్లాట్లకు వేలం వేయకుండా కాలయాపన ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. అలాగే కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్‌లో వివాదంలో ఉన్న 20 ప్లాట్లకు పరిష్కారం ఏమిటని, కాలనీ 15 ఫేజ్‌లో 150 ప్లాట్లు ఉండగా కొన్నింటికే వేలంపాట ఎందుకు నిర్వహించారన్నారు. జాయింట్ వెంచర్‌లో హౌసింగ్ బోర్డు స్వాధీనం చేసిన ఎల్ఐజీ ప్లాట్స్ డిమాండ్ సర్వే ఎందుకు నిర్వహించలేదన్నారు. కేపీహెచ్‌బీ కాలనీలో 15 సంవత్సరాల క్రితం నిర్మించిన 788 ప్లాట్లకు మోక్షం ఎప్పుడు కల్పిస్తారని అని అడిగారు. పలు ప్రజా సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించడం లేదని, అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్ , జనవరి 29 : 11 కేవీ శాతవాహననగర్, 11 కేవీ హైదర్‌నగర్, 11 కేవీ గౌతమీనగర్, 11 కేవీ హెచ్ఎంటీ హిల్స్, 11 కేవీ జలవాయువిహార్ ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శాతాహనగర్, హైదర్‌నగర్ , గౌతమీనగర్, హెచ్ఎంటీ హిల్స్, జలవాయువిహార్ కాలనీలలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు భాగ్యనగర్ ఏఈ షాబాజ్ బుధవారం తెలిపారు.